పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్ల పంపిణీ

ప్రజాశక్తి-ఆలమూరు

స్థానిక పంచాయతీ పారిశుధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న వారందరికీ శ్రీసిద్ధార్థ స్కూల్ కరస్పాండెంట్ కె.ముల్లారావు తన సొంత నిధులతో శుక్రవారం రెయిన్ కోట్లను పంపిణీ చేసి కార్మికుల సేవలను కొనియాడారు. నిత్యం గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి కార్మికులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఆయన అన్నారు. పారిశుధ్య కార్మికులకు భవిష్యత్తులో మరిన్ని అవసరాలు తీర్చేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాతి లావణ్యకుమార్ రాజా, పంచాయతీ సెక్రెటరీ కె.సంజీవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


అందజేస్తున్న సిద్ధార్థ కరస్పాండెంట్ ముల్లారావు

వీడని ముంపు

- నష్టం అంచనాల్లో అధికారులు
- శాంతించిన గోదావరి
- ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

ప్రజాశక్తి-అమలాపురం

గోదావరి తగ్గు ముఖం పట్టినా జిల్లాలోని లంక గ్రామాల్లో ముంపులో కొనసాగుతున్నాయి. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా గోదావరి వరదలు లంకల్లోని ప్రజలకు గడిచిన ఐదు రోజులుగా కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇళ్ల చుట్టూ భారీగా నీరు చేరి లంక ప్రాంతవాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ధవళేశ్వరంలోని కాటన్ ఆనకట్ట వద్ద శుక్రవారం 13.40 అడుగుల నీటిమట్టం నమోదై 12.27 లక్షల క్యూసెక్కుల జలాలు సముద్రంలోకి విడిచిపెట్టారు. రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించినప్పటికీ భద్రాచలం వద్ద నెమ్మదిగా నీటి మట్టం పెరగడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో సఖినేటిపల్లి మండలంలోని లాకుపేట, అప్పనరామునిలంక, ఓఎన్జీసీ కాలనీ, కొత్తలంకలో ఇళ్ల లో భారీగా వరద ఉంది. లాకుపేటలో పలు ఇళ్లు ముంపులోకి వెళ్లడంతో మెరక ప్రాంతంలో ఉన్న ఇళ్లలో వారు తలదాచుకున్నారు. ఈ క్రమంలో సమీప నివాసాలకు వెళ్లలన్నా పడవలే ధారం. తాగునీటి డబ్బాలను అధికారులు అందిస్తున్నారు. ముమ్మిడివరం మండలంలో లంక ఆఫ్ ఠాణేలంక, కూనలంక, గురజాపులంక, చింతల్లంక కాట్రేనికోన మండలం పల్లంకుర్రు పి.గన్నవరం మండలం శివాయలంక, చిన కందాలపాలెం లో ఇళ్ళ ముందు భారీగా వరద నీరు చేరంది అయినవిల్లి మండలం ఎదురుబిడెం క్వాజ్ వే పై వరద నీరు తగ్గిన రొడ్ల పై రాకపోకలు సాగించే పరిస్థితి పరిస్థితి లేదు.జిల్లాలోని 22 మండలాల్లో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. సుమారు 5000 వేల ఎకరాల్లో అరటి పువ్వులు, తమలపాకులు, బొప్పాయి కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అధికారులు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి నష్టాన్ని తీసుకు వెళ్లి నష్టపరిహారం అందజేయాలని అధికారులను రైతులు కోరుతున్నారు. పంటలు దెబ్బతినడంతో కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. కిలో ఉల్లిపాయలు రూ.50, కిలో బంగాళదుంపలు రూ.60, వంకాయ, బెండకాయ, బీరకాయ కిలో రూ.100 పై మాటే. **కపిలేశ్వరపురం:** మండలంలోని వరద ఉధతి తగ్గినప్పటికీ లంక పొలాల్లోని అరటి, కంద, వంగ, దొండ, బెండ, కొబ్బరి తదితర పంటలు ముంపు నీటిలో కొనసాగుతున్నాయి. లంకల్లో వేసిన పంటలకు వరద నీరు ప్రవాహం కొద్ది కొద్దిగా తగ్గడంతో పడవల్లో ఒడ్డికి చేర్చుకుని రైతులు ఒబ్బిడి తీసుకుంటుండగా మరి కొన్ని పంటలు పూర్తిగా పాడైపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు .ఇటుక బట్టీలు కూడా వరద నీటిలో కొన సాగుతున్నాయి. అధికారులు లంక గ్రామంలో పర్యటించి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వరదల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. వర్షాలకు ముంపుకు గురైన వరి చేలు క్రమక్రమంగా బయటపడుతున్నాయి .అయినప్పటికీ అవి పనికి రాకుండా పోతున్నాయని రైతులు వాపోతున్నారు. లంక గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహిస్తూ బ్లీచింగ్ చల్లించి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చర్యలు చేపట్టారు. గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య ఆరోగ్య సిబ్బంది వ్యాధుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. **రామచంద్రపురం:** భద్రాచలం వద్ద గోదావరి వరద నీటి ప్రవాహం పెరగడంతో కె.గంగ వరం మండలం కోటిపల్లి వద్ద వరద నీటి ఉధృతిని శుక్రవారం రాత్రి రామచంద్రపురం ఆర్డిఒ సుధా సాగర్ పరిశీలించారు. వరద నీరు పెరిగే అవకాశం ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని తహ శీల్దార్ రవీంద్రనాథ్‌కు సూచించారు. ఆయన వెంట టిడిపి నాయకులు రేవు శ్రీను, పెమ్మాడి సత్తిబాబు, ఎంపిడిఒ ఎన్. శ్రీనివాసు, విఆర్ఒ కృష్ణ సాయి తదితరులు ఉన్నారు.


అల్లవరం మండలం బోడశకుర్రు పల్లిపాలెం గ్రామంలో చేరిన వరద నీరు


వల్లూరులో ముంపు నుంచి బయటపడుతున్న వరిచేలు


శుక్రవారం రాత్రి కోటిపల్లి వద్ద గోదావరిలో వరదను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

సాగునీరు ఇవ్వకుండా పంట బోదె ఆక్రమణ

భూస్వామి సాపే సత్యనారాయణ పై చర్యలకు సిపిఎం బృందం డిమాండ్

ప్రజాశక్తి-కాట్రేనికోన

అనేక మంది పేదరైతుల భూమికి సాగు నీటిని వెళ్లనివ్వకుండా పంట బోదెను ఆక్రమించిన భూస్వామి సాపే సత్యనారాయణ పై తక్షణ చర్యలు తీసుకుని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేద రైతులందరికీ న్యాయం చేయాలని ఆయన కోరారు. మండల పరిధిలోని పల్లంకుర్రు శివారు బూలావారిపేట గ్రామంలో చిన్నపేద రైతులు తమ తమ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఒక పేద రైతుకు చెందిన కొంత పొలాన్ని భూస్వామి సాపే సత్యనారాయణ కొనుగోలు చేసి కింద రైతులను ఇబ్బందులు గురి చేస్తున్నట్లు సిపిఎం దృష్టికి సమస్యను పేద రైతులు తీసుకువెళ్లారు. దీంతో శుక్రవారం సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్, మండల నాయకులు విపర్తి మోహన్ రావు, పొలమూరి శ్రీనివాసరావు తదితరులు రైతులు వాకపల్లి వెంకటేశ్వరరావు, తాటిపాక స్వరూప్, కాశి సత్యనారాయణ పంట పొలాలను పరిశీలించారు. మూడు తరాల నుండి మెయిన్ కాలవ మీదగా పంట బోదు ద్వారా సుమారు ఎకరం పొలాన్ని పండించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత మూడు సంవత్సరాల క్రితం ఈ పేద రైతులు భూమికి ఆనుకుని ఉన్న పొలాన్ని సాపే సత్యనారాయణ కొనుగోలు చేశారు. పేదరైతులకు పొలానికి సాగు నీరు వెళ్లే పంటబోదెను తన పొలంలో కలిపేసుకోవడం వలన కింద రైతులకు సాగునీరు అందక అనే ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని పేద రైతులు అడగగా మీకు దిక్కు ఉన్న చోట చెప్పుకోండి.. మీ దగ్గర డాక్యుమెంట్స్ ఉంటే తెచ్చుకోండి అని మాట్లాడటంతో రైతులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై స్థానిక పోలీస్ స్టేషన్లోనూ ఫిర్యాదు చేశారు. దౌర్జన్యంగా తమ పంట బొదును పొలంలో ఆక్రమించుకున్న సత్యనారాయణ పై ప్రభుత్వపరంగా తగు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరినప్పటికీ నెలలు గడుస్తున్నా అధికార యంత్రంగా నుండి ఎటువంటి ఫలితం జరగలేదని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దీంతో సిపిఎంని ఆశ్రయించామని పేదరైతులు తెలిపారు. పేద రైతులను ఇబ్బందులకు గురి చేస్తే మిగిలిన రైతుల పొలాన్ని కూడా కొనుగోలు చేసు కోవడానికి వీలు కలుగుతుందనే కోణంలోనే ఇటు వంటి ప్రయత్నాలు చేస్తున్నారని వారు పేర్కొంటున్నారు.

పేదరైతులపై భూస్వామి సాపే సత్యనారాయణ ఈ విధంగా చేయడం ఆయనకు తగదని కారెం వెంకటేశ్వరరావు అన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఉన్నత అధికారులకు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం జరిగే విధంగా సిపిఎం కృషి చేస్తుందని కారెం వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. .


పల్లంకుర్రు శివారు బూలావారి పేట గ్రామంలో పంట పొలాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

రెవెన్యూ రికార్డుల భద్రతకు చర్యలు

ప్రజాశక్తి -రామచంద్రపురం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రెవెన్యూ రికార్డుల భద్రతపై మరింత పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిషాంతి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం రామచంద్రపురం పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఆమె సమావేశం నిర్వహిం చారు. రెవెన్యూ రికార్డుల భద్రత, వివిధ రకాల ధ్రువపత్రాలు పెండింగ్ అంశాలు, మ్యూటేషన్ల పెండింగ్ అంశాలపై జెసి సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులు అగ్నికి ఆహుతి అయిన విషయమై అను మానాస్పద సంఘటన నేపథ్యంలో రెవెన్యూ రికార్డుల భద్రతపై మరింత పటిష్టంగా వ్యవహరించాలని సూచించిందన్నారు. నిరంతరం రెవెన్యూ రికార్డుల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్ని రకాల ధ్రువపత్రాలు పెండింగ్ లేకుండా జారి చేయాలని ఆదేశించారు. మ్యూటేషన్లు పెండింగ్ లేకుండా అన్నింటినీ పరిష్కరించాలని, రెవెన్యూ రికార్డుల భద్రతపై పోలీసు యంత్రాంగం సహకారం తీసుకోవాలన్నారు.సాంకేతిక అంశాలలో సమస్యలు ఉత్పన్నమై నట్లయితే వాటిని ఉన్నత స్థాయి అధికారులకు నివేదించి పరిష్కార మార్గాలు పొందాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎస్.సుధా సాగర్, రామచంద్రపురం తహశీల్దార్ ఎం.వెంకటేశ్వ రరావు, ఇతరమండలాల తహశీల్దార్లు, సూపరింటెండెంట్లు, మండల సర్వేయర్లు, ఆర్‌డిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేర నియంత్రణకు చర్యలు: ఎస్‌పి

ప్రజాశక్తి-ముమ్మిడివరంరూరల్

నేర నియంత్రణకు రాత్రిపూట గస్తీని పటిష్టం చేసే విధంగా తగు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్‌పి బి.కృష్ణారావు సూచించారు. ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వార్షిక తనిఖీలు చేశారు. ముఖ్యమైన కేసుల్లో క్రైమ్ రికార్డులను, కేసు డైరీ రిజిస్టర్లను పరిశీలించారు. హత్యాయత్నం, గర్ల్ మిస్సింగ్, ప్రాపర్టీ, రోడ్డు ప్రమాద కేసుల్లో పెండింగ్ కేసులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలన్నారు. నేరాల అదుపుకు తీసుకోవల్సిన చర్యలను పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల ఫ్రెండ్లీ పోలీసింగ్ తో వ్యవహరించాలని సూచించారు. అనంతరం పోలీస్ క్వార్టర్స్ ను పరిశీలించి, నిరుపయోగంగా ఉన్న భవనాలను వినియోగానికి అనువుగా ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ బి సురేష్ బాబు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



సాయం అందజేస్తున్న గుడ్‌సీడ్ ఫౌండేషన్ సభ్యులు

బాధిత కుటుంబానికి కుంచే రమణారావు సాయం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి అమలాపురం నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు,గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు శుక్రవారం సాయం అందించారు. మునిపల్లి పంచాయతీ కోటుగట్టులో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో తిరుకోటి సురేష్ కుటుంబం నిరాశ్రయులైంది. బాధిత కుటుంబానిక కుంచే రమణారావు సాయం అందించారు. బాధిత కుటుంబానికి వంట సామగ్రి, నిత్యావసరాలు, దుస్తులు, కూరగాయలను గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు గంటా లక్ష్మీ ప్రసాద్, కుంచే అర్జున్, పరమట రాజేష్, నాగాబత్తుల రాజ్ కుమార్, బళ్ల చినరాజు, దోనిపాటి రాంబాబు, వెంకటేష్, పోలినాటి భీమేష్ లు అందజేశారు. సాయం అందించిన రమణారావుకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దోనిపాటి సత్యనారాయణ, దోనిపాటి సుబ్బారావు, సీతాల జనకి రామయ్య, దోనిపాటి భాస్కరరావు, సాదే ఆంజనేయులు, జల్లి ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-యంత్రాంగం

వరదలు, భారీ వర్షాలు నేపథ్యంలో జిల్లాలోని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. పనులను అధికారులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం పర్యవేక్షించారు. **అంబాజీపేట:** వర్షాలు, వరదల నేపథ్యంలో మాచవరం, తొండవరం గ్రామాల్లో ఎంపిడిఒ బి.సరోవరరావు, ఇఒపిఆర్‌డి బి.మమత లు శుక్రవారం ఆయా గ్రామాలను పర్యవేక్షించారు. అంబాజీపేట ప్రభుత్వ కార్యాలయానికి ఎదురుగా మెయిన్ రోడ్డు పక్కన డ్రైనేజీ వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ చల్లించి శానిటేషన్ పనులు ముమ్మరం చేశారు. వ్యాధులు వ్యాపించకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా మండల పరిధిలో అన్ని గ్రామాల్లో శానిటేషన్ పనులు చేపట్టినట్లు ఇఒపిఆర్‌డిబి.మమత తెలిపారు. మాచవరం, తొండవరం గ్రామాల సర్పంచులు నాగాబత్తుల శాంతాకుమారి, పేరాబత్తుల రామలింగరాజు (దొరబాబు), కార్యదర్శులు జిజివికె.కుమార్, డి.లక్ష్మీపతిలు ఆయా గ్రామాల్లో వరద ప్రభావిత ప్రాంతాలైన గ్రామాల పరిధిలలో ప్రతిఒక్కరూ పరిసరాలు పరిశుభ్రతకు ప్రాధాన్యత కల్పిస్తే వ్యాధులు సోకకుండా కాపాడుకోవచ్చని అవగాహన కల్పించి శానిటేషన్ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **అయినవిల్లి** : మండలంలో గ్రామాల్లో చేపట్టిన శానిటేషన్ పనులను శుక్రవారం డివిజనల్ పంచాయతీ అధికారి బొజ్జి రాజు పరిశీలించారు. ముంపున కు గురైన గ్రామంలో డివిజనల్ పంచాయతీ అధికారి శానిటేషన్ పై ప్రతి గ్రామంలోనూ తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శులు అందరూ దోమల నివారణకు ఎబిట్ మరియు మాలాథిన్ ముందు స్ప్రేయింగ్, నిల్వ నీరు ఉన్న ప్రాంతంలో ఆయిల్ బాల్స్ వేయాలని, పొగ ఫాగింగ్ ప్రతి ఏడు రోజులకు చేయాలన్నారు. ముగ్గు బ్లీచింగ్ పల్లపు ప్రాంతంలో ఎక్కువగా చల్లించాలని, ఎక్కడ కూడా గ్రామాల్లో చెత్తకుప్పలు ఉండకూడదన్నారు. గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు ,ప్రభుత్వ వైద్యాధికారులు తో సమన్వయం చేసుకుని గ్రామాల్లో దోమల నివారణకు వరద ఉధృతి తగ్గిన తర్వాత వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ చేసి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు ఇఒపిఆర్‌డి అధికారి గరిమెళ్ళ రవి, రాష్ట్ర సర్పంచుల సమైక్య కార్యదర్శి సలాది బుచ్చి రాజు, అయినవిల్లి పంచాయతీ కార్యదర్శి రామచంద్రరావు, ఆర్.సూర్య నారాయణమూర్తి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.


అంబాజీపేట లో శానిటేషన్ పనులు పర్యవేక్షిస్తున్న ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి, కార్యదర్శి

రెండు గ్రామాల్లో ఉచిత వైద్య పరీక్షలు

మండల న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో వైద్యశిబిరాల ఏర్పాటు

ప్రజాశక్తి-అంబాజీపేట

మండలన్యాయ సేవ అధికార సంస్థ అమలాపురం వారి సౌజన్యంతో తొండవరం, వాకలగరువు గ్రామాల సర్పంచు లు పేరాబత్తుల రామలింగరాజు(దొరబాబు), మద్దింశెట్టి నాగ సత్య చంద్ర సుబ్బారావు(దొరబాబు)ల ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరాలు ఆయా గ్రామాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథి గా విచ్చేసిన ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ మెగా వైద్య శిబిరం పేదలకు ఎంత గానో మేలు చేకూరుస్తుందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సూచనలు మేరకు ఈ శిబిరాల్లో పిహెచ్‌సి వైద్యాధికారి వి.గౌతమి, ఇఎన్‌టి సర్జన్ టి.వేణు కుమార్, అమలాపురం ఏరియా హాస్పిటల్ జనరల్ వైద్యులు విజయ్ మదీనా, వంశీ కృష్ణ, పి.గన్నవరం సామాజిక ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు పి.ప్రభాకర్‌లు వైద్య సేవలు అందించారు. ఈ వైద్య పరీక్షలలో తొండవరం 70 మంది, వాకలగరువులో 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు వాకపల్లి కాశీవిశ్వనాథం, న్యాయవాది వెంపరాల భాస్కర శాస్త్రి, పిహెచ్‌సి సిహెచ్ఒ.అప్పారావు, జెవిఎస్ఆర్.ప్రసాద్, ఎఎన్ఎమ్ లు ఎన్.జ్యోతిరత్నకుమారి, అర్‌బి.గౌరీ శ్వరి, రెండు గ్రామాల నాయకులు, పంచాయతి సభ్యులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న ఎంపిపి

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు 'పల్లా'కు అభినందన

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

రాష్ట్ర టిడిపి అధ్యక్షులు, గాజువాక ఎంఎల్ఎ పల్లా శ్రీనివాసరావును మాజీ జెడ్‌పిటిసి సభ్యులు, టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దేశంశెట్టి వెంకట లక్ష్మీనారాయణ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస రావుకు దుశ్శాలువా కప్పి పూలమాలలతో సత్కరించి అభినందించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై వారిద్దరూ చర్చించారు.


పల్లా శ్రీనివాసరావును సత్కరిస్తున్న దేశంశెట్టి లక్ష్మీనారాయణ

పాఠశాలల్లో స్టూడెంట్ కిట్ల అందజేత

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో స్టూడెంట్ కిట్లను శుక్రవారం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. **ముమ్మిడివరంరూరల్:** ప్రభుత్వం అందిస్తున్న స్టూడెంట్ కిట్లను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని టిడిపి నాయకుడు కాశి రామచంద్ర రావు(కాశిపతి) పేర్కొన్నారు. నగర పంచాయతీ 2వ వార్డు పరిధిలోని పల్లిపాలెం ప్రాథమిక పాఠశాల్లో శుక్రవారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ పంపిణీలో భాగంగా విద్యార్థులకు బ్యాగ్‌లను రామచంద్రరావు చేతులు మీదుగా అందజేశారు కార్యక్రమంలో పాటశాల ప్రధానోపాధ్యాయురాలు వాసంశెట్టి దుర్గాదేవి, కొండేపూడి గౌతమ్, నల్లా భారత్ వడ్డీ సత్యనారాయణ, నెలపూడి వంశీ దేవరపల్లి బాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే 13వ వార్డు మల్లయ్య పాలెం ప్రాథమిక పాఠశాల్లో టిడిపి నాయకుడు మెండి రాజశేఖర్ ఆధ్వర్యం లో జరిగిన కిట్స్ పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర అంగన్ వాడి, డ్వాక్రా సాధికారిక ఆఆర్గనైజింగ్ సెక్రెటరీ మెండి కమల ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు కిట్స్ పంపిణీ చేశారు కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వై.వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.15 వార్డు క్రాపచింతలపూడి పాఠశాల్లో కౌన్సిలర్ మాదాల నాగ సత్య మంగా కుమారి చేతులు మీదుగా కిట్స్ పంపిణీ చేశారు. **రామచంద్రపురం**: ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు బాగా రాణించాలని వెంకటాయపాలెం సర్పంచ్ ఎల్లమెల్లి సతీష్ కుమారీ అన్నారు. శుక్రవారం వెంకటాయపాలెం జెడ్‌పి హై స్కూల్లో స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యుడు మెర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపిటిసి సభ్యురాలు కణితి వెంకటేశ్వరి , ఉపసర్పంచ్ గంధం బుజ్జి , హై స్కూల్ హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.**ఉప్పలగుప్తం:** స్టూడెంట్ కిట్లను సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థి పట్టుదలతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ కోరారు.గొల్లవిల్లి పంచాయతీ పరిధిలోని ఎంపిపి పాఠశాలల్లో శుక్రవారం సర్పంచ్ శ్రీదుర్గ, ఎంపిటిసి సభ్యురాలు దోనిపాటి బాలమ్మ, టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకట్ల ఏసుబాబు, కూటమి నాయకులు విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేశారు.కార్యక్రమంలో కూటమి నాయకులు ఆడబాల సత్యనారాయణ, కాగిత సత్యనారాయణ, నాగారపు అర్జునరావు, చప్పిడి కిరణ్, పెట్టా రాంబాబు తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం (అల్లవరం):** అల్లవరం జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో స్టూడెంట్ కిట్లను శుక్రవారం విద్యార్థులకు అందజేశారు. ఐఐఐటి ఒంగోలు క్యాంపస్ లో సీటు సాధించిన పాఠశాల విద్యార్థిని కడలి దివ్య తేజశ్రీని దుశ్శాలువా తో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యిళ్ళ శేషగిరిరావు, జెడ్‌పిటిసి సభ్యురాలు కొనుకు గౌతమి, మహేష్ , సర్పంచ్ బొమ్ము బాలవేణి, ఎంపిటిసి సభ్యురాలు నిచ్చేనకోళ్ల మౌనిక, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ గెద్దాడ శ్రీనివాసరావు, హెచ్ఎం నయినాల వెంకటేశ్వరరావు,బండిగుప్తాపు పాండురంగ, నడింపల్లి సూరిబాబు రాజు, మామిడిశెట్టి శ్రీరాం, గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు:** విద్యార్థులకు గుణాత్మక విద్యను పెంపొందించేలా బోధన చేయాలని సర్పంచ్ సంగీత సుభాష్ అన్నారు. మండలంలోని పినపళ్ళ ఎంపియుపి స్కూల్ నందు స్టూడెంట్ కిట్లు శుక్రవారం ఆయన కూటమి నాయకులతో కలసి పంపిణీ చేశారు. తదుపరి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు పెద్దిరెడ్డి పట్టాభి రామన్న, మాజీ ఎఎంసి ఛైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు, ఉప సర్పంచ్ యనమదల రాణి, శ్రీనివాస్, విద్యా కమిటీ ఛైర్మన్ తమ్మన దుర్గాభవాని, జనసేన గ్రామ అధ్యక్షులు నామాల సుబ్బారావు, జంగం రామారావు, ప్రధానోపాధ్యాయులు రమేష్, కనకదుర్గ ఉపాధ్యాయులు రామకృష్ణ, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పల్లిపాలెం ప్రాథమిక పాఠశాల్లో స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేస్తున్న రామచంద్రరావు



పినపళ్ల ఎంపియుపి స్కూల్లో స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సుభాష్

గ్రామస్థాయిలో వైద్యసేవలపై ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి-ఆలమూరు

గ్రామీణ స్థాయిలో వైద్యారోగ్య సిబ్బంది అందిస్తున్న సేవలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక అధికారి కె.వీరబాబు అన్నారు. ఆలమూరు మండలంలోని సంధిపూడిలో ఆయుష్మాన్ భారత మందిర్‌లో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ బృందం ఆకస్మిక తనిఖీ చేసింది. వారు మాట్లాడుతూ కచ్చితత్వమైన వైద్య సమాచారాన్ని సేకరించి వైద్య సిబ్బంది మరింత మెరుగ్గా నాణ్యమైన సేవలను అందించేందుకు గత ఏడాది ఏర్పాటు చేసిన జిల్లా టాస్క్‌ఫోర్స్ (డీటీఎఫ్) విభాగం విశేష సేవలను అందిస్తుందన్నారు. సీజనల్ అంటువ్యాధులు వ్యాప్తి చెందుతున్నందున క్షేత్రస్థాయి సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని పిహెచ్‌సి వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సాయికిషోర్‌కు టాస్క్‌ఫోర్స్ బృందం సూచించింది. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పి.ఉమ, ఎం.శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పిలు వి.సువర్చల, ఆర్.భాను ప్రియాంక, హెల్త్ అసిస్టెంట్ ఆర్.నాగేశ్వరరావు, ఎంపిహెచ్ఎస్‌లు కె.విజయలక్ష్మి, కె,వెంకాయమ్మ, సిహెచ్.ఉమా మహేశ్వరి, డిపిహెచ్ఎన్ఓఒ పిబిఎల్.కుమారి, డేటా మేనేజర్ ఎస్‌టిపి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

110 వారాలుగా కొనసాగుతున్న అన్నదానం

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని వేగాయమ్మపేటలో 110 వారాలుగా అన్నదాన కార్యక్రమం కొనసాగు తోంది. ఇక్కడ గల షిరిడి సాయిబాబా ఆలయంలో నిర్వాహకులు దెందులూరి భీమశంకరాచార్యులు ఆధ్వర్యంలో ఈ అన్నదానం నిర్వహిస్తున్నారు. 2006లో నిర్మించిన సాయిబాబా ఆలయంలో ప్రతి గురువారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారు. దీంతో పరిసర ప్రాంతాల యాత్రికులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు. 110 వారాలుగా కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమానికి యాత్రికులు సహాయ సహకారాలు అందజేశారని నిర్వాహకులు భీమశంకరాచార్యులు ఈ సందర్భంగా 'ప్రజాశక్తి'కి వివరించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు గ్రామస్తులకు భీమశంకరాచార్యులకు అభినందనలు తెలిపారు.


వేగాయమ్మ పేటలో అన్నదాన కార్యక్రమం

నేరాలు ఘోరాలు

హత్య కేసులో నలుగురికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ పరిధిలో యనమదల గ్రామంలో జరిగిన హత్య కేసులో నలుగురు నిందితులకు జీవిత ఖైదు విధించినట్లు ద్రాక్షారామ ఎస్ఐ గెల్లా సురేంద్ర తెలిపారు. వివరాలు ఇవి.. 6.09.2015న సాదే జనార్ధన రావుకు సంబంధించి భూ సరిహద్దు లోకి ధారా అప్పారావు, అతని కుమారులు ధారా సింహాద్రి, ధారా చంటి, ధారా రాజశేఖర్ కత్తులతో కర్రలతో వచ్చి సాదే జనార్ధనరావుపై దాడి చేశారన్నారు. ఈ దాడిలో జనార్ధనరావు చనిపోయాడని, మృతుని రెండవ కుమారుడు సాదే దుర్గా ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి ద్రాక్షారామ ఎస్ఐ కె.వంశీధర్ కేసు నమోదు చేశారు. అప్పటి సిఐ పి.కాశీ విశ్వనాథం దర్యాప్తు చేసి నిందితులు ధారా అప్పారావు, ధారా సింహాద్రి, ధారా చంటి, ధారా రాజశేఖరను అరెస్టు చేశారు. రాజమహేంద్రవరం కోర్టులో స్పీడీ ట్రయిల్ కేసుగా కేసును ట్రయిల్ జరుగగా, పిపి జి.వెంకట రత్నం బాబు, ప్రాసిక్యూషన్ వాదోపవాదాలు జరిగాయి. అనంతరం జడ్జి ఆర్. శ్రీలత నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష, ఒక్కొక్కరికీ రూ.5 వేలు జరిమానావిధించినట్లు ఎస్ఐ సురేంద్ర తెలిపారు.

పొన్నమండ సర్పంచ్ అరెస్ట్

ప్రజాశక్తి-రాజోలు

ఒక యువతిని మోసం చేసిన కేసులో రాజోలు మండలం పొన్నమండ గ్రామ సర్పంచ్ కుక్కల బేబీ కుమారిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టులో ఆమెను హాజరు పరశగా న్యాయమూర్తి ఆమెకు 14 రోజులు రిమాండ్ విధించారు. వివరాల్లోకి వెళితే పొన్నమండ సర్పంచ్ కుక్కల బేబీ కుమారి చిన్న కుమారుడు స్టాలిన్ అదే గ్రామానికి చెందిన సరెళ్ల జెస్సీని అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పెద్దల సమక్షంలో ఎన్ని సార్లు అడిగిన పెళ్లికి నిరాకరించడంతో పాటు సర్పంచ్ బేబీ కుమారి,ఆమె పెద్ద కుమారుడు కుక్కల లెనిన్, బంగారు ఫోన్ చేసి బెదిరించారని ఫిర్యాదులో పేర్కొంది. జెస్సీని ఫిర్యాదు మేరకు సిఐ కేసు నమోదు చేశారు. ఏ1 నిందితుడు పరారీ లో ఉన్నాడని అతని తల్లి బేబీకుమారిని అరెస్టు చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామని సిఐ ఆర్.గోవింద రాజు తెలిపారు.

ఆటో చోరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సామర్లకోట

ఇంటి బయట ఉంచిన ఆటో దుండగులు చోరీ చేయడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. జగ్గమ్మగారిపేటలో వెంకట శివకు చెందిన ఆటోను గురువారం రాత్రి ఇంటిముందు ఉంచగా తెలియని ఇద్దరు నిక్కర్లు వేసుకున్న దుండగులు అపహరిస్తున్నట్లు ఆ ప్రాంతంలోని సిసి కెమెరాల్లో నమోదయ్యింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ అంకబాబు తెలిపారు.

ఆభరణాల చోరీ నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి-పెదపూడి

జి.మామిడాడ ఆలయంలో చోరీ ఘటనలో నిందితుని అరెస్ట్ చేసి ఆభరణాలు రికవరీ చేసామని కాకినాడ డిఎస్పి కె.హనుమంతరావు తెలిపారు. శుక్రవారం పెదపూడి స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 5న వెంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగి 14 కేజీల వెండి ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. ఈ కేసులో సికింద్రాబాద్‌కు చెందిన అముగోతు రాములు నాయక్‌ను నిందితునిగా గుర్తించారు. అతడి నుంచి 14 కేజీల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితుడుపై రెండు తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 15 కేసులు ఉన్నాయని డిఎస్పి తెలిపారు.

మహిళపై గొడ్డలితో దాడి

ప్రజాశక్తి-గొల్లప్రోలు (పిఠాపురం)

మహిళపై విచక్షణారహితంగా గొడ్డలితో దాడి చేసిన సంఘటన గొల్లప్రోలు నగరంలోని ఎస్‌సి కాలనీలో శ క్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక రంగప్ప చెరువు ఎస్‌సి కాలనీలో నివాసం ఉంటున్న ఎన్.రాజ్యలక్ష్మికి సమీపంలోని వేమగిరి రాజేష్‌కు బాత్రూం ప్రహరీ గోడ విషయంపై తగాదా ఉంది. శు క్రవారం ఇంట్లో ఒంటరిగా ఉన్న రాజ్యలక్ష్మిపై రాజేష్ గొడ్డలితో విచక్షణ రహితంగా దాడి చేశాడు. తీవ్ర గాయాలు అయిన రాజ్యలక్ష్మిని కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సిఐ శ్రీనివాస్ ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరించారు.



ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న వైసిపి నాయకులు

పంచాయతీ సభ్యుని ఆత్మహత్య

ప్రజాశక్తి - సామర్లకోట

వేట్లపాలెంకు చెందిన వైసిపి పంచాయతీ వార్డు సభ్యుడు బొబ్బిలి వీర వెంకట సత్యనారాయణ (35) శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోషల్ మీడియాలో టిడిపి, జనసేన నాయకులు బెదిరింపులకు పాల్పడుతూ అసభ్యకరమైన పోస్టులను పెడుతున్నారని సత్యనారాయణ ఆత్మహత్యకు పాల్పడినట్టు కుటుంబ సభ్యులు ఆరోపించారు. మృతుని ఇంటి వద్దకు వైసిపి నాయకులు కార్యకర్తలు అధికంగా చేరుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. సంఘటనాస్థలాన్ని పెద్దాపురం డిఎస్‌పి కె.లతాకుమారి, క్రైమ్ సిఐ అంకబాబు, పరిస్థితిని సమీక్షించారు. పెద్దాపురం ప్రభుత్వాసుపత్రి వద్ద వైసిపి నాయకులు కార్యకర్తలు మతుని కుటుంబికులు ఆందోళన చేపట్టారు. దోషులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని వైసిపి పెద్దాపురం ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు డిమాండ్ చేశారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం మతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

యానాం వార్తలు

విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి - యానాం

విశాలాంధ్ర పుస్తక ప్రదర్శనను శుక్రవారం యానాం స్టేట్ బ్యాంకు సెంటర్‌లో ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను యానాం విద్యాశాఖాధికారి ప్రవీణ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, కథకుడు దాట్ల దేవదానంరాజు, జెవివి రాష్ట్ర నాయకులు కె.వి.వి.సత్యనారాయణ, యానాం సమగ్ర శిక్ష అభియాన్ అధికారి కమిడి ప్రభాకర్, దంగేటి త్రిమూర్తులు, కవి తాతపూడి సోమశేఖరశర్మ, ఎన్.రామమూర్తి, ఎస్.కె.వీరభద్రరాజు, పొనుగుమట్ల అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పుస్తకాలయంను సందర్శించారు. పుస్తకాలయంలో బాల సాహిత్యం, కథలు, కవిత్వం, నవలలు, విమర్శ, జీవిత చరిత్రలు తదితర అంశాలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నట్టు వేన్ ఇన్‌ఛార్జి ఎస్.రామకృష్ణ తెలిపారు. చరిత్ర, కులం, మతం, జెండర్, పర్యావరణం, పర్యాటకంతో పాటు శాస్త్ర, సాంకేతిక రంగాలకు సంబంధించిన గ్రంథాలు ఉన్నట్టు తెలిపారు. విశాలాంధ్ర ప్రచురణలతో పాటు ఎమెస్కో, పెంగ్విన్, జైకో, రీమ్, గీతా ప్రెస్, భూమి బుక్ ట్రస్ట్, హెచ్.బి.టి, తదితర ఆంగ్లం, తెలుగు ప్రచురణ సంస్థల పుస్తకాలు ఉన్నట్టు తెలిపారు. ఈ పుస్తకాల కొనుగోలుపై పదిశాతం డిస్కౌంట్ ఉందన్నారు. మరో మూడు రోజులు పాటు ఈ ప్రదర్శన యానాంలో ఉంటుందని చదవరులు, పుస్తక ప్రియులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కనకాలపేటలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాలపేట రామాలయం వద్ద ఉన్న మున్సిపల్ కళ్యాణ మండపంలో శుక్రవారం డయాబెటిక్, జనరల్ మెడికల్ క్యాంప్ నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆదేశాల మేరకు లయన్స్ క్లబ్ కాపులపాలెం గోల్డ్, లయన్స్ క్లబ్ యానాం పిల్లారాయ, లయన్స్ క్లబ్ కనకాలపేట ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ పిల్లారాయ ప్రెసిడెంట్ పులవర్తి శ్రీను తెలిపారు. డాక్టర్ రేణుక అధ్యక్షతన డయాబెటిక్, ఆస్తమా, ఊపిరితిత్తుల సమస్యలు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సుమారు 70 మందికి పైగా వైద్య పరీక్షలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు, ఎస్ఆర్ఎంటి మూర్తి, కవల గణపతి, గొర్రెల రాజేష్, కోన దేవా, నల్లం సురేష్, కవల తిరుమల నాయుడు, చందు పాల్గొన్నారు.



వరద ప్రభావిత ప్రాంతంలో పర్యటిస్తున్న ఎంఎల్ఎ అశోక్

వరద ప్రాంతాల్లో ఎంఎల్ఎ పర్యటన

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తన ఢిల్లీ పర్యటనను ముగించుకుని శుక్రవారం యానాం చేరుకున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలలో సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. టైడల్ లాక్, శివం బాత్, బాలయోగి వారధి, కనకాలపేట లంక భూములు కోతకు గురైన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ముందస్తు సహాయక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతానికి వరద తగ్గుముఖం పట్టిందని రాబోయే రోజుల్లో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు విష జ్వరాల బారిన పడకుండా బ్లీచింగ్ చల్లించి, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ అధికారులు సూచించారు. రాజీవ్ బీచ్‌లో పర్యాటకులకు ఇబ్బందులు లేకుండా మరుగుదొడ్ల మరమ్మతులు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడబ్ల్యుడి ఇఇ చంద్రశేఖరన్, ఎఇ కాళ్ళ నాగరాజు, జెఇ జ్యోతి రాజు, ఎస్ఐ మురుగానందం, నాయకులు నక్కల సుబ్బన్న, పండు సిద్ధార్థ కుమార్, వాసిరెడ్డి సుబ్బారావు పాల్గొన్నారు.

సామాన్యునికి అందుబాటులో ఇసుక ధరలు

ప్రజాశక్తి-అమలాపురం

సామాన్యునికి అందుబాటులో ఇసుక ధరలు ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఇసుక కమిటీ అధ్యక్షులు ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఆరు స్టాక్ యార్డుల్లో ఇసుక పరిమాణం సరఫరా ఆన్లైన్ డిజిటలైజేషన్ ప్రక్రియ నిర్వహణ, అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులపై విచారణ డి-సిల్టేషన్ పాయింట్లు ఎంపిక, ఒక వ్యక్తికి ఆధార్ కార్డు పై రోజువారి 20 మెట్రిక్ టన్నులు ఇసుక సరఫరా అంశాలపై ఆయన సమీక్షిం చారు. కార్యక్రమంలో జిల్లా జెసి టి.నిషాంతి, ఆర్‌డిఒలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌యు డిస్టెన్స్ డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్య విభాగం డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ వి.వెంకటేశ్వర్లును మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రావు మాట్లా డుతూ ఎపిలోఅత్యుత్తమ యూనివర్సిటీగా ఖ్యాతి గాంచిన నాగార్జున యూనివర్సిటీ దూర విద్యా విభాగం మరింత విశిష్ట సేవలు అందజేయాలని ఆకాంక్షిం చారు. అనంతరం వెంకటేశ్వర్లును దుశ్శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్య క్రమంలో మోడరన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కో -ఆర్డినేటర్ పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఆలమూరు

ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నామని స్థానిక చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు గుణ్ణం వీర్రాజు, గన్ని విష్ణు, గారపాటి త్రిమూర్తులు అన్నారు. శుక్రవారం వారు జూనియర్ కళాశాల్లో ప్రభుత్వం నుంచి వచ్చిన ఉచిత నోటు పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థుల ఫీజులను చారిటబుల్ ట్రస్ట్ చెల్లిస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ కళాశాల్లో చేర్చాలని వారు కోరారు. కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపల్ కృష్ణ, అధ్యాపకులు సాంబశివమూర్తి, అరుణ కుమార్, గోవింద్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-ఐ.పోలవరం

మహిళలపై జరుగుతున్న సాంఘిక దురాచారాల పైనా, వారి రక్షణ కోసం అమల్లో ఉన్న చట్టాలపై ప్రత్యేక హెల్ప్ లైన్ ఏర్పాటు చేశామని ముమ్మిడివరం ఐసిడిఎస్ ఐ.విమల శుక్రవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సదస్సు నిర్వహించారు. కేంద్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 100 రోజుల ప్రత్యేక అవగాహన ప్రచారాల్లో భాగంగా 21 జూన్ నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తారన్నారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు ముమ్మిడివరం పరిధిలోని ఐ.పోలవరం మండల కేంద్రంలో, కొమరగిరి గోడివారి పేట కమ్యూనిటీ భవనం నందు, మురమళ్ళ ప్రాథమికఉన్నత పాఠశాల నందు, గుత్తెనదీవి, జి.జగ్గంపేట అంగన్‌వాడీ కేంద్రాల నందు అవగాహన శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో విస్తరణాధికారులు సిహెచ్.నాగలక్ష్మి, జె.మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఒఎన్‌జిసి నెలకు రూ.18 వేల పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఒఎన్‌జిసి, వివిధ ఆయిల్ కంపెనీల వల్ల మత్స్యకారుల జీవన ఉపాధి కి భారీగా నష్టపరుస్తున్నందున ప్రతి నెల రూ.18 వేలు ప్రతి మత్స్యకార కుటుంబానికి ఇవ్వాలని ఎపి మత్స్యకార సంఘం అధ్యక్షులు దోమ ఆదినారాయణ డిమాండ్ చేశారు. జాతీయస్థాయి చిన్న తరహా మత్స్యకారుల సంఘం సమావేశం చెన్నైలో నిర్వహించారు. దక్షిణా రాష్ట్రాలు కేరళ, తమిళనాడు, కర్ణాటక ఆంధ్రప్రదేశ్ నుంచి కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. 25, 26 తేదీల్లో జరిగిన సమావేశానికి మన రాష్ట్రం నుండి అధ్యక్షులు దోమ ఆదినారాయణ, ఉపాధ్యక్షులు, సభ్యులు హజరైయ్యారు.

వేలం ద్వారా రూ.7.34 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

తిరుపతి గ్రామంలో దుకాణాల నుంచి ఆసీలు వసూలుకు, శృంగార వల్లభ స్వామి ఆలయం వద్ద పార్కింగ్‌కు నిర్వహించిన వేలంలో పంచాయితీకి రూ.7,34,000 ఆదాయం సమకూరిందని పంచాయితీ కార్యదర్శి భార్గవ్ తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయం వద్ద ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి బివివి.రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలం పాటలలో సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వేట్లపాలెం పాఠశాలను సందర్శించిన ఎంఇఓ

ప్రజాశక్తి- సామర్లకోట

మండలంలోని వేట్లపాలెంలో ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఇఒ-1 శివరామకృష్ణయ్య సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న విద్యా ప్రవేశ కార్యక్రమాలను, సంసిద్ధత కార్యక్రమాలు, శిక్ష సప్తాహ్ కార్యక్రమాల అమలును గురించి హెచ్ఎంఉన అడిగి తెలుసుకున్నారు. విద్య ప్రవేశ కార్యక్రమాలను దీక్ష యాప్‌లో లాగిన్ అయి ప్రతి ఉపాధ్యాయుడూ అప్‌లోడ్ చేయాలని సూచించారు. విద్యార్థుల పఠన నైపుణ్యాలను, రాత నైపుణ్యాలను ప్రతి తరగతికీ వెళ్లి పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో ప్రతి విద్యార్థి తెలుగు, ఇంగ్లీష్‌లో అంశాలను చదవాలని, రాయాలని దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ముఖ్యంగా పాఠశాలలో నమోదైన ప్రతి విద్యార్థి యుడైస్‌లో నమోదయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలలో 5వ తరగతి పిల్లలందరికీ గణిత అంశం నుంచి స్థాన విలువలను గురించి వివరంగా బోధించి పిల్లలచే కొన్ని సంఖ్యలకు స్థాన విలువలను రాయించారు.



శ్మశాన వాటిక స్థలాఇన్న పరిశీలిస్తున్న ఆర్‌డిఒ కిషోర్

శ్మశాన వాటిక స్థల పరిశీలన

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

ఉప్పాడ పంచాయతీలోని కొత్తపట్నం, బర్మా కాలనీ, సుబ్బంపేటకు చెందిన మత్స్యకార ప్రజలు కొన్నేళ్లుగా శ్మశాన వాటిక లేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ఉప్పాడ సముద్ర తీరానికి, కాకినాడ ఉప్పాడ బీచ్ రోడ్డును ఆనుకుని ఉన్న సుబ్బంపేటలో కొన్నేళ్లుగా మత్స్యకారులు దహన సంస్కారాలు చేస్తున్నారు. వారు పడుతున్న ఇబ్బందులను డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లగా, తక్షణమే శ్మశాన వాటిక స్థలాన్ని కేటాయించాలని స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు ఎస్‌పిజిఐని ఆనుకుని ఉన్న, కాకినాడ అర్బన్ ప్రజలకు ఇచ్చిన భూమిలో మత్స్యకారులకు శ్మశాన వాటిక స్థలాన్ని కేటాయించేందుకు ఆర్‌డిఒ ఇట్ల కిషోర్, తహశీల్దారు ఎం.సుందర్‌రాజ్ శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కృషి చేసినందుకు మూడు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అధికారుల వెంట గ్రామ పెద్దలు పట్టా శివ, మెరుగు భూషణం, దాసరి అర్జునరావు, జోగేంద్రరావు, వనమాడి యల్లారావు, పంతాడ అప్పారావు, రాకాతి రాము, లోవరాజు, పరదేశయ్య పాల్గొన్నారు.

నాక్ గుర్తింపు నిబంధన అన్యాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలలకు నాక్ గుర్తింపు లేకపోతే కళాశాల గుర్తింపు రద్దు చేస్తామని బెదిరించడం అన్యాయమని ఎపి ఎయిడెడ్ కాలేజెస్, అన్ ఎయిడెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వి.లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు కళాశాలలకు నాక్ గుర్తింపు లేకపోయినా విద్యార్థులకు పాఠాలు చెబితే చాలు కళాశాల గుర్తింపు రద్దు చెయ్యనప్పుడు ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలలకు నాక్ గుర్తింపు ఎందుకు రద్దు చేస్తారని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఎయిడెడ్ సంస్థలు బలోపేతం చేయాలంటే ముందుగా సరిపడినంత మంది అధ్యాపకులను నియమించాలన్నారు. విద్యా వ్యవస్థలో మార్పులు సరిచేయాలన్నారు. నాక్ గుర్తింపు ఉండాలని గవర్నమెంట్ తప్పనిసరిగా నిర్ణయం తీసుకుంటే అది ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేట్ ఎయిడెడ్ అని తేడా లేకుండా అన్ని సంస్థలకు వర్తించేలా జిఒ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఎయిడెడ్ లెక్చరర్లకే కాక మిగిలిన అన్ ఎయిడెడ్, పార్ట్ టైం, గెస్ట్, ప్రైవేటు లెక్చరర్లకు కనీస వేతనం అమలు చేసేలా జిఒ జారీ చేసి అమలు చేయాలన్నారు.

రిజిస్ట్రార్ కార్యాలయంలో డిఆర్ తనిఖీలు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండల కేంద్రమైన జగ్గంపేటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా రిజిస్ట్రార్ రామలక్ష్మి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ పూర్తయిన దస్తావేజులకు కొన్ని కారణాలతో ఆన్‌లైన్ సంతకాలు ఆలస్యం అవుతున్నాయని, ఈ సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని రిజిస్ట్రార్ కార్యాలయాలను పరిశీలిస్తామన్నారు. జగ్గంపేటలోని రికార్డులను పరిశీలించామన్నారు.

కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

ఎస్‌పి విక్రాంత్ పాటిల్ శుక్రవారం కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, భవనాన్ని పరిశీలించారు. వివిధ రికార్డులను పరిశీలించి ఎస్‌ఐ స్వామి నాయుడుకు పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, రికార్డులను జాగ్రత్తగా నమోదు చేయాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారిని మర్యాద పూర్వకంగా చూసి వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

సాంకేతిక నైపుణ్యాన్ని పెంచుకోవాలి

ప్రజాశక్తి -సామర్లకోట

మారుతున్న సాంకేతిక యుగంలో విద్యార్థి దశలోనే డిజిటల్ టెక్నాలజీని అవగాహన చేసుకుంటూ సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ పేర్కొన్నారు. శు క్రవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా స్కిల్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌పిల ద్వారా, టాబ్‌ల ద్వారా టెక్నాలజీని ఉపయోగించే మెళకువలను ఉపాధ్యాయులు కెవివి.సత్యనారాయణ, జి.గోవింద్ విద్యార్థులకు వివరించారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - జగ్గంపేట

మహిళలు, బాలికలు తమకు రక్షణ కల్పించే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఒ పూర్ణిమ అన్నారు. మండలంలోని గొల్లలగుంటలో శుక్రవారం జెడ్‌పిఉన్నత పాఠశాలలో మిషన్ శక్తి వంద రోజుల అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా మహిళలు, బాలికలకు సంబంధించి చట్టాల గురించి అందరికీ అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. బాల్యవివాహాలు, మహిళల అక్రమ రవాణా, బాలలపై అఘాయిత్యాలు, భిక్షాటన వంటివి నిర్మూలించాలంటే గ్రామ, మండల స్థాయిలో పలుచోట్ల అవగాహన కల్పించాన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అమ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

పెద్దాపురం : పరిసరాల పరిశుభ్రత ప్రజలందరూ బాధ్యతగా చేపట్టినప్పుడే విజయవంతం అవుతుందని మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి అన్నారు. స్వచ్ఛ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు ఆధ్వర్యంలో స్థానిక పరదేశమ్మ కాలనీలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో కమిషనర్ పద్మావతి మాట్లాడారు. తమ ఇంటితోపాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచినప్పుడే ప్రజారోగ్యం బాగుపడుతుందన్నారు. స్థానిక తలుపులమ్మ కాలనీకి, ఇండస్ట్రియల్ పార్కుకు వెళ్లే రహదారి చెత్త మయంగా మారిపోయిందని దాన్నిపరిశుభ్రం చేసినట్టు దావీదు రాజు తెలిపారు. చెత్తను బయట వేయకుండా వాహనాలకు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.